ప్రజాశక్తి
గురువారం 6 ఏప్రిల్ 2023



8న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ఎదుట నిరసన


ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 8న గిరిజన ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట నిరసనలు చేపడుతున్నట్లు ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ తెలిపారు. బుధవారం సవరభాష వాలంటీర్లతో కలిసి ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనతో గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా, గిరిజన ఎమ్మెల్యేలు స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల్లో గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు జాతి కోసం నిలబడతారా, పార్టీ కోసం నిలుస్తారా? అంటూ ప్రశ్నించారు. తక్షణమే పదవులకు రాజీనామా చేసి పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. గిరిజన సర్పంచులు, ఎంపిటిసిలు తమ పదవులకు రాజీనామా చేసి గిరిజన పక్షాన ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి బిడ్డిక శంకర్ రావు, సవర భాష వాలంటీర్ల సంఘం నాయకులు భీమారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సిఎస్‌ఆర్ నిధులతో..

డిజిటల్ క్లాస్ రూములు

ఉదారంగా సహకరించిన భారత్ డైనమిక్ లిమిటెడ్



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాకు మంజూరైన సిఎస్‌ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో స్కిల్‌డెవలప్‌మెంట్, డిజిటల్ క్లాస్ రూముల నిర్మాణం చేపడుతున్నారు. వెనుకబడిన జిల్లాల సరసన విజయనగరం ఉన్న విషయం విదితమే. ఈనేపథ్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ (బిడిఎల్) నుంచి గత ఏడాది సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ.5.4 కోట్లు ఇచ్చింది. ఇందులో ఇప్పటికే సగం నిధులు ఖర్చుచేసినట్టు సమాచారం. వీటిలో రూ.3కోట్లను జిల్లాలో డిజిటల్ క్లాస్‌రూంల ఏర్పాటుకు కేటాయించారు. మిగిలిన రూ.2.4 కోట్లను స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయించారు. డిజిటల్ క్లాస్‌రూములకు సంబంధించి డిసిఎంఎస్ ద్వారా కంప్యూటర్లు, ప్రొజక్టర్స్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేశారు. విద్యాశాఖ సాంకేతిక సహకారం అందించింది. ఇప్పటికే రూ.2.8కోట్లు విడుదల చేసినట్టు సమాచారం. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహణ బాధ్యత డిఆర్‌డిఎకు అప్పగించారు. ఈ శిక్షణ తరగతులు మహిళా ప్రాంగణంలో జరుగుతున్నాయి. దీనికి సంబంధించి రూ.1.2 కోట్లు ఇప్పటి వరకు ఖర్చుచేసినట్టుగా తెలుస్తోంది. పూసపాటిరేగలోని మైలాన్ కంపెనీ కూడా స్థానిక గురుకుల పాఠశాల అభివృద్ధికి ఇటీవల రూ.1.5కోట్లు కేటాయించింది. ఈ నిధులను డార్మెటరీ తదితరాలకు ఖర్చు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ కంపెనీల నుంచి సోషల్ రెస్పాన్సుబిలిటీ నిధులు విరివిరిగా మంజూరవు తున్నాయి. వీటిని సకాలంలో పథకం ప్రకారం సద్వినియోగం చేసుకుంటే జిల్లాలో చాలా వరకు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చు కునేందుకు అవకాశం ఉంటుందని పలువురు వ్యాఖ్యాని స్తున్నారు. రాష్ట్ర విభజనలో భాగంగా మన జిల్లాకు ఏటా రూ.50కోట్లు చొప్పున ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సివున్నప్పటికీ రెండేళ్లు మాత్రమే నిధులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పాలకులు ఎలాగూ ప్రశ్నించలేదు. దీంతో, మిగిలిన నిధులు రాలేదు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి మరింత బరితెగించింది. ఏటా రూ.5కోట్ల చొప్పున ఎంపీ నిధులు కేటాయించాల్సి ఉండగా 2019-20లో రూ.5కోట్లు, కరోనా కష్టాల పేరిట 2020-21లో రూ.2కోట్లు మాత్రమే కేటాయించింది. అనంతరం నిధులు కేటాయించ లేదు. ఇంతకు ముందు మాదిరిగా ఎమ్మెల్యేలకూ నిధుల కేటాయింపు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో సిఎస్‌ఆర్ నిధులు జిల్లాకు ఎంతో ఉపయోగ పడతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

జిల్లా అభివృద్ధికి సమయం పడుతుంది

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-కలెక్టరేట్

కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అయినా పూర్తిస్థాయిలో అభివృద్ధికి కొంత సమయం పడుతుందని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర తెలిపారు. బుధవారం మెయిన్ రోడ్డు నుంచి నూతనంగా నిర్మించిన కార్యాలయ ముఖద్వారాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత సంవత్సర కాలంగా జిల్లాలో చేపట్టిన ప్రగతిని వివరించారు. జిల్లా ఏర్పడి ఏడాది కాలం మాత్రమే పూర్తయిందని, ఒక్కసారిగా అభివృద్ధి చెందడం సాధ్యమయ్యే పని కాదని తెలిపారు. దశల వారీగా జిల్లాను అభివృద్ధి చేస్తామని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని తెలిపారు. జిల్లాకు రూ.600 కోట్లతో వైద్య కళాశాల మంజూరైనట్లు వెల్లడించారు. నూతన కలెక్టరేట్, వైద్య కళాశాల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

కలెక్టరేట్, ఇతర జిల్లా కార్యాలయాల నిర్మాణం కోసం అడ్డాపుశీల గ్రామంలో 60 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం కింద 21,353 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 306 రైతు భరోసా కేంద్రాల ద్వారా 25,043 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా కాగా, అందులో 18966 మంది గిరిజనులకు 3101 క్వింటాళ్ల విత్తనాలు అందించినట్లు తెలిపారు. రైతు భరోసా ద్వారా 1.34 లక్షల మంది రైతులకు రూ.185 కోట్లు చెల్లించినట్లు చెప్పారు.



కలెక్టరేట్ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కలెక్టరు నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని వెల్లడించారు. జిల్లాలో గిరిజన గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేయాలనే ఉద్దేశంతో 4జి కనెక్టివిటీ కల్పన నిమిత్తం 180 టవర్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జూన్ నాటికి 160 టవర్ల నిర్మాణం పూర్తిచేయనున్నట్లు చెప్పారు. జూన్ తరువాత జిల్లాలో పూర్తిస్థాయిలో నెట్‌వర్క్ కనెక్టవిటీ అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లాలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా, జాతీయ రహదారి 130 పిడి పనులు 550 కోట్ల రూపాయిల వ్యయంతో జరుగుతున్నాయని తెలిపారు. పార్వతీపురం స్టేషనులో 14 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, పాముల పుష్పశ్రీవాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణం

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని ప్రముఖ నాడీ జ్యోతిష్యులు మురపాక కాళిదాసు యాజి ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర దంపతుల చేతుల మీదుగా సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. రాజన్నదొర దంపతులకు కాళిదాసు యాజి, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.



వాగ్వివాదానికి దిగిన టిడిపి నాయకులు జయకృష్ణ, ఎమ్మెల్యే కళావతి

అరెస్టులు.. వాగ్వివాదం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వివాదం నెలకొంది. సీతంపేటలో వైఎస్‌ఆర్ ఆసరా సంబరాలు నిర్వహిస్తుండటంతో ముందస్తుగా కొంతమంది గిరిజనులను, గిరిజన సంఘాల నాయకులను, టిడిపి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ.. పోలీస్ స్టేషనుకు చేరుకున్నారు. గిరిజనులను, నాయకులను ఎందుకు అక్రమంగా అదుపులోకి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇంతలో ఎమ్మెల్యే వి.కళావతి స్టేషన్‌కు చేరుకుని, గిరిజనులను విడిచిపెట్టాలని డిఎస్‌పి కృష్ణారావును కోరారు. ఇదంతా మీరే చేశారని జయకృష్ణ వాదించగా, ఎమ్మెల్యే కళావతి కూడా అందరినీ విడిచి పెట్టాలని కోరారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చవద్దని కొద్ది రోజులుగా గిరిజనులు పలు రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కొంతమందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని సద్దుమణిగించారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

సీతంపేట : ముందస్తు అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని గిరిజన సంఘం నాయకులు బి.అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చినందుకు నిరసన తెలుపుతారని ముందస్తుగా గిరిజన సంఘం నాయకులు ఎ.భాస్కర్‌రావు, ఎ.గంగాధర్, కె.భాస్కర్‌రావును పోలీసులు నిర్బంధించడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ చర్యలు మానుకోవాలని హితవుపలికారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

కలెక్టర్ నిశాంత్‌కుమార్



పాలకొండ.. జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి, అణగారిన వర్గాలకు ప్రత్యేక హక్కులు ఉండాలని బాబూ జగ్జీవన్‌రామ్ పోరాటం చేశారని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఆయన అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ 115వ జయంతిని కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కలెక్టర్, జెసి ఒ.ఆనంద్ పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు జగ్జీవన్‌రామ్ సహకారం అందించి, వారి అభివృద్ధికి కృషి చేయాలని పోరాడారని తెలిపారు. జగ్జీవన్ నైపుణ్యాలను గుర్తించి కానిస్టిట్యూషనల్ అసెంబ్లీలో అవకాశం కల్పించారని చెప్పారు. హరిత విప్లవానికి ఆయన నాంది పలికారని కొనియాడారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేసి ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పి ఎ.సుభాష్, ఇన్‌ఛార్జి జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.శశిధర్ కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్ కృష్ణాజి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారామ్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి పి.సూర్యనారాయణ, ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సామల సింహాచలం, వివిధ సంఘాల సభ్యులు శ్రీదేవి పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి డిఇఒ ఎస్‌డివి రమణ పూలమాల వేసి నివాళులర్పించారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం సచివాలయంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకర్‌రావు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక దేవానంద్, దోస్త్ మేరా దోస్త్ అధ్యక్షులు పాలక ప్రేమానంద్, సభ్యులు తుంబలి వినోద్, మద్ది శ్రీధర్, మధు, గ్రామ సేవాదళ్ బోటు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, ఉద్యోగులలో కలిసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ గొర్లి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : నగర పంచాయతీ కార్యాలయంలో ఆలిండియా దళిత హక్కుల ఫోరం ఆధ్వర్యంలో జగజీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ పి.విక్రాంత్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ వై.రాధాకుమారి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహన్, బాసూరు కాంతారావు, కోడెం విజయకుమార్, పల్లా భాను, ఆలిండియా దళిత హక్కుల ఫోరం జిల్లా అధ్యక్షులు బత్తిని మోహనరావు, ఉద్యోగ సంఘ నాయకులు వై.సతీష్ కుమార్, దళిత నాయకులు భోగి విశ్వేశ్వరరావు, తందర వెంకట్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. రిటైర్డ్ ఎఎస్‌డబ్ల్యుఒ కళింగ ప్రేమ భూషణ్ రావు, విజయనగరం జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటి సభ్యులు రేజేటి జయరాం, కెవిపిఎస్ రాష్ట్ర నాయకుడు ఎన్.గురుమూర్తి, లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర, వార్డెన్ చింతాడ త్రినాథ్ పాల్గొన్నారు.



వీరఘట్టం.. జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్, సుధాకర్, తదితరులు

సాలూరు : పట్టణంలోని పెదదళితపేట కమ్యూనిటీ భవనంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సేవా సంస్థ ఆధ్వర్యాన కోర్ కమిటీ సభ్యులు, రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు నివాళులర్పించారు. సేవా సంస్థ సభ్యులు నాగేశ్వరరావు, శ్యామ్ పాల్గొన్నారు. శ్రీవెంకట విద్యాగిరి పాఠశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.రామకృష్ణ పాల్గొన్నారు.

వీరఘట్టం : వీరఘట్టంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి విశ్రాంత ఉద్యోగులు ఎ.రామ్ కుమార్, వి.సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్.దాలయ్య, పైడయ్య, ఎన్.విజయభాస్కరరావు, ఎన్.కళ్యాణ్ ప్రసాద్, ఎస్.శశిభూషణరావు, ఎన్.కళ్యాణ్, ఎ.వీరేశు, ఒ.జయలక్ష్మి, ఎన్.రాము, బి.వెంకటి, ఎస్.ప్రసాదరావు, ఎ.రవికుమార్, బోగేషు, ప్రసాదరావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు నివాళులర్పించారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారిలో ఆయన విగ్రహానికి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీశ్ నివాళులర్పించారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

వికటించిన ఇంజెక్షన్.. బాలుడికి ఇన్ఫెక్షన్

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రికి అనేక అనారోగ్య కారణాలతో వస్తున్న నిరుపేద రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యమో, ఇంజెక్షన్ చేస్తున్నప్పుడు నాణ్యమైన పరికరాలు వినియోగించడం లేదో గాని చాలా రోగులకు వైద్యం వికటిస్తోంది. వారం రోజుల క్రితం మండలంలోని నెలిపర్తి గ్రామానికి చెందిన లింగాల రామ్‌ప్రసాద్ అనే విద్యార్థి జ్వరంతో బాధపడుతున్న కారణంగా ఆసుపత్రికి తీసుకెళ్ళారు. జ్వరం నివారణ కోసం వైద్యుల సలహా మేరకు ఆసుపత్రిలోనే కింద స్థాయి సిబ్బంది ఇంజెక్షన్ చేశారు. ఇంజెక్షన్ చేయించుకున్న తర్వాత బాలుడు రామ్‌ప్రసాద్ పిరుదుపై ఇన్ఫెక్షన్ అయింది. ఎందుకలా అయిందో తెలియని రామ్ ప్రసాద్ తల్లిదండ్రులు మళ్ళీ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళి వైద్యులకు చూపించారు. చేసిన ఇంజెక్షన్ బాలుడికి ఇన్ఫెక్షన్ కావడంతో పిరుదు వాచిపోయింది. దీంతో వైద్యులు రామ్‌ప్రసాద్ పిరుదుపై ఏర్పడిన కాయలాంటి వాపుని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న చాలా మంది రోగులకు ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయి. ఆసుపత్రి సిబ్బందికి ఇంజెక్షన్ చేయడం రాకనో, నాణ్యమైన సిరంజీలను వినియోగించక పోవడం వల్లనో ఇన్ఫెక్షన్ అవుతోంది. గత కొంతకాలంగా తరచూ ఇలా జరుగుతున్నా రోగులు నోరు మెదపడం లేదు. నిరక్షరాస్యులైన రోగులకు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నష్టం జరుగుతున్నా వైద్యాధికారులు స్పందించడం లేదు.



ఇన్ఫెక్షన్‌కు గురైన బాలుడు రామ్‌ప్రసాద్

భానుడి భగభగలు

బయటకు వెళ్లడానికి భయపడుతున్న ప్రజలు

భానుడు భగభగమంటూ నిప్పులు కక్కుతున్నాడు. ఎండలు దంచి కొడుతుండడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. బయటికి వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే భానుడి ప్రతాపం మొదలవుతోంది. గత మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఎండలు పెరిగిపోవడంతో మే, జూన్‌లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేస్తుంది.

ప్రజాశక్తి - కురుపాం

పగలు రాత్రి అని తేడా లేకుండా ఇంట్లో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రేపటి నుంచి మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు, చిన్న పరిశ్రమల కార్మికులు, పేద కుటుంబాలు, ఉపాధి హామీ పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఉపాధి హామీ అధికారులు ఎండ వేడి నుంచి కార్మికులు, కూలీలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తాగునీరు, నీడ అవసరం

వేసవి మొదలైందంటే ప్రతి ఒక్కరికీ తాగునీరు, ఎండ వేడిని తట్టుకోవడానికి నీడ అవసరం. ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించే ప్రదేశంలో కచ్చితంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు. ప్రయివేట్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖలు యాజమాన్యంపై ఉంది.



ఎండ వేడిమిని తాళలేక గొడుగు పట్టుకుని వెళ్తున్న మహిళ

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

గతంలో గ్రామీణ, మండల ప్రాంతాల్లో ఎక్కువగా జనసంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలు దాహార్తిని తీర్చేందుకు ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేవారు. ఈ ఏడాది ఇంత వరకు ఎక్కడా చలివేంద్రం ఏర్పాటు చేసే పరిస్థితి లేదు. కావున ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, అధికారులు అధిక జన సంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పలువురు కోరుతున్నారు.

అంగన్వాడీ టీచర్ పోస్టు

రూ.8.20 లక్షలకు వేలం

- దరఖాస్తు చేసినందుకు వెలివేస్తామంటూ బెదిరింపులు
- కలెక్టర్‌కు వికలాంగ మహిళ ఫిర్యాదు
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండలంలోని రెల్లి పంచాయతీ పరిధిలోగల ముమ్మనవాని పాలెంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ చేసేందుకు ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గ్రామంలోని పెత్తందారులు గ్రామాభివృద్ధి పేరుతో ఈ పోస్టును బహిరంగ వేలం వేయడంతో జిల్లాలో చర్చనీయాంశమైంది. అన్ని అర్హతలూ ఉన్న గ్రామానికి చెందిన వికలాంగ మహిళ గంగాధర లక్ష్మి తనకు ఆ పోస్టు ఇప్పించాలని గ్రామ పెద్దలను వేడుకుంది. అయినా పట్టించుకోకుండా అందరి సమక్షంలో రూ.8.20 లక్షలకు వేలం వేయడంతో మరో మహిళ ఆ పోస్టును కైవసం చేసుకుంది. దీంతో గంగాధర లక్ష్మి వేలం పాటను వ్యతిరేకించి టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. గ్రామ కట్టుబాటుకు వ్యతిరేకంగా దరఖాస్తు చేస్తావా అంటూ గ్రామంలోని కొందరు పెద్దలు గ్రామం నుంచి వెలి వేస్తామంటూ బెదిరింపులకు పాల్పడి బహిరంగ ప్రచారం చేశారని లక్ష్మి జిల్లా కలెక్టర్ సూర్యకుమారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తనకు అన్ని అర్హతలూ ఉన్నాయని, నిరుపేదరాలైన తనకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటోంది. గురువారం కొత్తవలస ఐసిడిఎస్ కార్యాలయంలో ఈ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ జరగనుంది. అయితే అధికారులు ఇంటర్వ్యూను పారదర్శకంగా జరిపి అర్హులకు న్యాయం చేయాలని పలు ప్రజా సంఘాలు కోరుతున్నాయి.



ఫిర్యాదును చూపిస్తున్న వికలాంగ మహిళ లక్ష్మి

పాటూరులో పురాతన శిలా శాసనం లభ్యం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు గ్రామంలో గల జగన్నాథ స్వామి ఆలయం సమీపంలో పురా తన శిలాశా సనం లభ్యమైంది. ఆ గ్రామ మంచినీరు కోనేరులో ఈ శిలా శాసనం రాతి పలక లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. ఈ శిలాఫలకానికి ఫొటో తీసి విశాఖపట్నంలో గల పురాతన వస్తు శాఖకు పంపించారు. ఈ శిలాఫలకం 11,12 వ శతాబ్దాలకు చెందినదిగా, తూర్పు గాంగల కాలం నాటిదని అంచనా వేసినట్లు ఆలయ అర్చకులు ప్రసాద్ తెలిపారు.


బయట పడిన శిలాశాసనం

గురుకులం పిలుస్తోంది..

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో శివన్నపేటలోని గిరిజన గురుకుల పాఠశాలలో 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఆరో తరగతిలో 11 సీట్లు, 7వ తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో నాలుగు, 9వ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసిలకు చెందిన వారు ఏప్రిల్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 94924 50649 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

7న పార్వతీపురంలో సదస్సు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 7న పార్వతీపురంలోని గిరిజన భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలో ఉన్న గిరిజన నాయకులంతా హాజరుకావాలని కోరారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలనే ముఖ్యమంత్రి తీర్మానాన్ని నిరసిస్తూ ప్రతీ గిరిజనుడు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కులు, చట్టాల కోసం పోరాడకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.


సామగ్రిని పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి, వైసిపి నాయకులు

'మా భవిష్యత్తు జగనన్నే' సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం, నిడగల్లు, రంగంపేట, గాజులవలస, కోట సీతారాంపురం, గుచ్చిమి తదితర గ్రామాల్లో మా భవిష్యత్తు జగనన్నే కార్యక్రమం సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి బి.రమణమ్మ శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో గృహసారథుల ద్వారా ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల స్టిక్కర్లను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఆర్.వి.పార్థసారథి, ఎం.ధనుంజయనాయుడు, ఎన్.గోపాలం నాయుడు పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గౌరీశంకర్ రావు , తదితరులు

శ్రీశ్రీ కళావేదిక ఉత్సవాల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 9, 10వ తేదీల్లో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించనున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకర్రావు ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయులు పాల్గొనడం కూడా అరుదైన విషయంగా కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.ప్రేమానంద్, సాహితీ చైతన్య కిరణాలు రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక దేవానంద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కేజీపూడి గిరిజన గ్రామ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి పనులను ఎట్టకేలకు బుధవారం ప్రారంభించారు. ఈ పనులను మండల పరిషత్తు నిధుల నుంచి చేపడుతున్నట్లు ఎంపిపి దొగ్గ సత్యవంతుడు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రోడ్డుకు రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. విజయ రామసాగర్‌కు వెళ్లే గడ్డకు వంతెన నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారయ్య, ఎంపిటిసి ముత్యాలమ్మ, జిల్లా రైతు సంఘం నాయకుడు చల్లా జగన్, వైసిపి మండల అధ్యక్షుడు జగన్నాథం, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో రూ.70 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, నాడు నేడు పాఠశాల భవనాల నిర్మాణాలను డిఇ జయప్రకాష్ బుధవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీరాజ్ జెఇ రామకృష్ణారావుకు సూచించారు. గడువులోగా పూర్తిచేసి అన్ని హంగులతో అందజేయాలని సూచించారు. నిబంధనలు ప్రాప్తికి పనులు చేపట్టాలన్నారు. స్థానిక వైసిపి నాయకులు లెంక రాంబాబు, నాడు నేడు జెఇ దాలయ్య ఆయనతో పాటు ఉన్నారు.

పెట్టుబడులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మనం ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేటపుడు నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే అంశంపై విశాఖకు చెందిన ఐఐఎం అసోసియేట్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు వివరించారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'డెసిషన్ మేకింగ్ విత్ స్ప్రెడ్ షీట్స్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ లాభాలు ఆర్జించాలనుకుంటారని అందుకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు సత్కరించారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

బాడంగి : మండలంలోని అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కొండలరావు హెచ్చరించారు. బుధవారం ముగడ గ్రామంలో అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిని ఆయన పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుకను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. అనంతరం ఆయన పై కేసు నమోదు చేశారు. ఇసుక తరలిస్తే ఎవరైనా పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు

పనులే పూర్తి కాలేదు కానీ...

ఫర్నీచర్ వచ్చిందోచ్..!

- ఐదేళ్లు గడిచినా పూర్తికాని తహశీల్దార్ కార్యాలయ భవనం
- గడువు ముగిసినా ముందుకు కదలని పనులు
- కార్యకలాపాలకు ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- రేగిడి

మండల తహశీల్దార్ నూతన కార్యాలయం పూర్తి చేసేది ఎప్పుడని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాత కార్యాలయం పూర్తిగా శిథిల వ్యవస్థలో ఉంది. ఈ కారణంగా 2018 ఏప్రిల్ 22న టిడిపి హయంలో జిల్లా కలెక్టర్ ధనంజయ రెడ్డి, ఎస్‌డిఎఫ్ నిధులు రూ. 90 లక్షలు మంజూరు చేశారు. అప్పటి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రిగా ఉన్న కిమిడి కళా వెంకటరావు నూతన తహశీల్దార్ కార్యాలయానికి శిలాఫలకం వేశారు. పనులు పూర్తి చేసేందుకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. 9 నెలల్లో పనులు పూర్తి చేసి అన్ని రంగులతో అందించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు జిల్లా కలెక్టర్ అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి పాలకొండ ఆర్‌డిఒ రెడ్డి గున్నయ్యకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఐదు నెలలు మాత్రమే పనులు స్పీడ్‌గా జరిగి తరువాత చతకిలపడ్డాయి. స్లాబ్ వరకు పూర్తి చేశారు.



శిథిలావస్థకు చేరిన పాత తహశీల్దార్ కార్యాలయం

నిధులు విడుదల కాక..

కార్యాలయ నిర్మాణానికి వెచ్చించిన ఎస్‌డిఎఫ్ నిధులు విడుదల కాకపోవటంతో కాంట్రాక్టర్ గత ఐదేళ్లుగా ఎటువంటి పనులూ చేపట్టలేదు. నూతన తహసీల్దార్ కార్యాలయం నేటి వరకు పూర్తి కాకపోవటంతో శిథిలావస్థలో ఉన్న పాత తహశీల్దార్ కార్యాలయంలోనే అధికారులు, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షానికి, ఎండలకు పెచ్చులు ఉడుతూ ఎప్పుడు కూలిపోతుందోనని భయభ్రాంతులతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో కంప్యూటర్ గదులు, పుస్తకాలు ఉంచు గదులు, ప్రాంగణాలు తడిసిపోవటంతో గదుల్లో ఉన్న దస్త్రాలు తడిసి ముద్దవుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నూతన తహశీల్దార్ కార్యాలయం పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టిసారించి నూతన తహశీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పనులు పూర్తికాకుండానే ఫర్నీచర్

వాస్తవానికి తహశీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు పూర్తికాలేదు. కానీ ఇప్పటికే అందులో వినియోగించాల్సిన బెంచీలు, కుర్చీలు, కంప్యూటర్లును మాత్రం కొనుగోలు చేశారు. వీటిని కొనుగోలు చేయడానికి కూడా రూ. లక్షలు ఖర్చుపెట్టిన్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తి కాకముందు ఇలా ప్రజా ధనాన్ని వృథా చేసి ఫర్నీచర్ కొనుగోలు చేయడం పట్ల పలువురు మండిపడుతున్నారు. అయితే నూతన భవనం ఇప్పట్లో పూర్తి కాదని భావించిన అధికారులు ఈ ఫర్నీచర్‌ను పాత భవనంలో పెట్టి వినియోగించుకుంటున్నట్లు తెలిస్తోంది.


మధ్యలో నిలిచిపోయిన నూతన కార్యాలయ భవనం


బిల్లులు చెల్లించలేకనే నిర్మాణం పూర్తి కాలేదు

రేగిడి తహశీల్దార్ కార్యాలయానికి నిర్మాణ పనులలో భాగంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేక నిర్మాణం పూర్తి కాలేదు. నిర్మాణ పనులకు రూ.90 లక్షలు ప్రతిపాదనలు చేశాం. రూ.67 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇందులో ఇంతవరకు రూ. 28 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించాం. మిగతా రూ.39 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. అయినా కాంట్రాక్టర్ ముందుకు వచ్చి పనులు చేశారు. బిల్లులు వచ్చాకే మిగతా పనులు పూర్తి చేస్తాం.

నాగభూషణరావు, ఆర్అండ్‌బి జెఇ , రాజాం.

జీవనోపాధులు పెంపొందించడానికి 'ఆసరా'

ఎమ్మెల్యేలు కళావతి, జోగారావు


సీతంపేట.. చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఐటిడిఎ పిఒ నవ్య

ప్రజాశక్తి-సీతంపేట

మహిళల జీవనోపాధులు మెరుగుపరచడానికి ఆసరా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. బుధవారం స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో మహిళలకు మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముందుగా వైఎస్ఆర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్ని విధాలుగా మహిళలను ఆదుకుంటున్నారని చెప్పారు. సీతంపేట మండలంలో 6 వేల కుటుంబాలకు రూ.5.30 కోట్లను అందజేశామన్నారు. ఐటిడిఎ పిఒ బి.నవ్య మాట్లాడుతూ ఆసరా పథకం ద్వారా 9 వేల మందికి తొమ్మిది కోట్లు రూపాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లక్ష్మి, ఎంపిపి బి.ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, వైస్ ఎంపిపి సరస్వతి, వైసిపి నాయకులు రాము, ఎపిడి నారాయణరావు, ఎపిఎం విజయ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. పట్టణంలో బెలగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మున్సిపల్ పరిధిలోని వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కార్యక్రమం ద్వారా 826 స్వయం సహాయక సంఘాల్లోని 8,288 మంది మహిళా సభ్యులకు రూ.5.94 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. వైసిపి నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతితో కలిసి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని కుటుంబ ఆదాయాలను పెంచుకొని, సంతోషంగా ఉండాలని కోరారు. మహిళాభివృద్ధి ద్వారానే కుటుంబాభివృద్ధి జరుగుతుందని గట్టిగా నమ్మిన సిఎం జగన్.. అందుకనుగుణంగా పథకాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, మున్సిపల్ కమిషనర్ రామ అప్పల నాయుడు, మెప్మా పిఎం ఎం.విజయ్ కుమార్, పిఒలు చిట్టెమ్మ, పద్మ, శశిభూషణ్, టిఎల్ఎఫ్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

గర్భిణుల గృహాల సందర్శన

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పి.చాకరాపల్లి, అజ్జాడ గ్రామాల్లో బుధవారం గర్భిణులు, బాలింతల ఇళ్లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. పిల్లల వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. టీకా కేంద్రంలో ఉండాల్సిన వ్యాక్సిన్ కిట్, అందులో వ్యాక్సిన్ శీతోష్ణ స్థితి, అత్యవసర మందుల కిట్, హబ్ కట్టర్, టీకా అర్హుల జాబితాను పరిశీలించారు. టీకా కార్డులను పరిశీలించి గడువు తేదీలో టీకా వేస్తున్నది, లేనిది పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. వేసవిలో పిల్లలు, గర్భిణుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతల గృహ సందర్శనలు చేసి అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. డి-హైడ్రేషన్‌కు గురికాకుండా నీరు, మజ్జిగ, నిమ్మరసం, బార్లి, ఓఆర్ఎస్ మొదలగు ద్రావణాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా గర్భిణులు, బాలింతలు అత్యవసరమైతే తప్ప దూరప్రాంతాలు, బయటకు ఎక్కువగా వెళ్లరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి.చిన్నమ్ములు, ఎం.సోనియా, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రతిఒక్కరికీ పని కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ప్రజాశక్తి-సీతానగరం

జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు అన్ని పంచాయతీల్లోనూ ప్రతిఒక్కరికీ పనికల్పించేలా ఉండాలన్నారు. పనులు రెండు పూటలా చేసేలా ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎపిఒ పి.భాను, ఇసి కృష్ణ, సిబ్బంది కూర్మారావు, శ్రీదేవి, జానకి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాశీపేట, పణుకుపేట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిఒ భాను పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలోని నవగం, తుమరాడ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు. సమయపాలన పాటించి పనులకు హాజరు కావాలని సూచించారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

డావిన్సీ చిత్రాలు ఎందరికో ప్రేరణ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

డావిన్సీ కళాత్మక చిత్రాలు అనేక శాస్త్రాలకు అవసరమైన ప్రాథమిక పరికల్పనలను అందించాయని ప్రముఖ చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు అన్నారు. స్నేహకళా సాహితీ ఆధ్వర్యంలో బుధవారం వేదాంత జూనియర్ కళాశాలలో 'డావిన్సీ - కళ -జీవితం' పుస్తక పరిచయం నిర్వహించారు. మోహన్‌దాస్ అధ్యక్షత వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోనాలిసా, ది లాస్ట్ సప్పర్ వంటి చిత్రాల ద్వారా ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి చెందినప్పటికీ ఆయన అనేక రంగాలలో గొప్ప ప్రతిభను కనబరిచిన బహుముఖ ప్రతిభాశాలి అన్నారు.

ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ ఎన్నో కళలున్నప్పటికీ చిత్రకళ పట్ల ఉండే ఆసక్తి బాల్యం నుండే బయట పడుతుందన్నారు. దీనిని గుర్తించి తల్లిదండ్రులు తగిన విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో రచయితలు మల్లిపురం జగదీశ్, పక్కి రవీంద్రనాథ్, సిరికి స్వామినాయుడు, చింత అప్పలనాయుడు, సి.హెచ్.పారినాయుడు, వి.కృష్ణమూర్తి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు

ఒకవైపు రాజకీయం.... మరోవైపు పోడు వ్యవసాయం

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన మహిళలు ఒకవైపు రాజకీయాల్లో రాణిస్తూ మరోవైపు పోడు వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి ఒకవైపు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తనకు ఉన్న ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా పోడు వ్యవసాయంపై ఆసక్తి కనబరుస్తున్నారు. బుధవారం తాడికొండ గ్రామానికి వెళ్లి తమ పోడు వ్యవసాయంలో జీడి తోటను పరిశీలించారు. జీడి పిక్కలను సేకరించారు.

- ప్రజాశక్తి, గుమ్మలక్ష్మీపురం


జీడి పిక్కలు ఏరుతున్న జగదీశ్వరి

నేరాలు ఘోరాలు

బొలెరో వాహనం బోల్తా

డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బీరుపాడు పంచాయతీ దబ్బలగూడ గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ పువ్వల హరి మృతి చెందాడు. హరి స్వగ్రామం నెల్లికికెక్కువ. స్థానికుల కథనం.. నెల్లికికెక్కువ నుంచి బొలెరో వాహనంలో రాయగడ వెళు తుండగా ఈ సంఘటన జరిగింది. బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులు ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా జిమ్మిడిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


బోల్తాపడిన బొలెరో వాహనం

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లికి చెందిన వాడాడ కిరణ్ (36) అనే వ్యక్తి భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో మంగళవారం రాత్రి ఇంట్లో ప్యానుకు ఉరివేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కిరణ్‌కు డోకిశిల గ్రామానికి చెందిన భారతితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. తాగుడుకు బానిసగా మారిన కిరణ్ కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో విసుగుచెందిన భార్య పుట్టింటికి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఎన్నిసార్లు పిలుపుచేసినా రావడం లేదని మనస్తాపంతో కిరణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

870 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎస్ఇబి సిఐ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో మండలంలోని బొడ్డవలస గ్రామంలో బుధవారం నాటు సారా అమ్ముతున్న పీడిక అప్పన్నను అదుపులోకి తీసుకున్నారు. 510 లీటర్ల సారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. సారా సరఫరా చేస్తున్న ఒడిశా రాష్ట్రం జగ్గుడా గ్రామానికి చెందిన కద్రక రామన్నపై కేసు నమోదుచేశారు. బాలగుడబ గ్రామ సమీపంలో దాడులు చేపట్టి 360 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన బంగారి వెంకట్, సిరిపురపు. ప్రశాంత్, బంగారి ఆర్జున్, తవుడు, సారా సరఫరాదారుడు ఒడిశాలోని చోరిపల్లి గ్రామానికి చెందిన బాలుపై కేసు నమోదు చేసినట్లు ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐలు శేఖరం, రమణ, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.